కరాటేలో ప్రతిభ.. సన్మానం



ప్రతిభ చూపిన వారిని సన్మానిస్తున్న మాస్టర్ కృష్ణ

కుత్బుల్లాపూర్: ఆత్మరక్షణకు కరాటే ఎంతో అవసరమని భూమ్స్ అకాడమీ నిర్వాహకుడు మాస్టర్ కృష్ణ అన్నారు . కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని గాజులరామారం అకాడమీలో ఇటీవల వివిధ వేదికలపై ప్రతిభ చాటిన మోక్షిత్, సాయిలకు సర్టిఫికెట్లు ప్రదానం చేసి అభినందించారు. ఇద్దరు విద్యార్థులు కాటా, కుమ్మిటే అండర్ -10 విభాగాల్లో ప్రథమ స్థానం పొందినట్లు పేర్కొన్నారు. సుమారు 200కు పైగా విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు.

బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించాలి



సమావేశంలో పాల్గొన్న పెద్దలు

నిజాంపేట్: నిజాంపేట్ గ్రామ పెద్దలు, ప్రజలు రామ్ పంతుల సమక్షంలో కొలన్ నరసింహారెడ్డి, కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, కొలన్ భద్రారెడ్డి, రాజమోహన్‌రెడ్డిలు సమావేశం ఏర్పాటై బతుకమ్మ వేడుకలపై చర్చించారు. ఈ నెల 29న సద్దుల బతుకమ్మ, అక్టోబర్ 2వ తేదీన దసరా పండుగలు ఘనంగా నిర్వహించాలని నిర్ణయించారు. సమావేశంలో కుమ్మరి వెంకటేష్, మంగలి ఎల్లయ్య, వడ్ల చారి, బక్క దుర్గయ్య, ఏ.యాదయ్య, బక్క నరసింహ, తలారి జీతయ్య, బైండ్ల నాగేష్, బ్యాగరి మహిపాల్, బ్యాగరి సత్యనారాయణ, చాకలి రాజు, ఒక్కరాజు, బి సత్తయ్య, సదానంద్ పాల్గొన్నారు.

కేంద్ర సహాయ మంత్రిని కలిసిన నేతలు



కుత్బుల్లాపూర్: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని బుధవారం కరీంనగర్ శ్రీ మహాశక్తి అమ్మవారిని కేంద్ర హోం సహాయ శాఖా మంత్రి బండి సంజయ్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆయనను అమ్మవారి వస్త్రాలతో సత్కరించారు. కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీజేపీ నాయకులు ఆకుల సతీష్, నల్ల జై శంకర్ గౌడ్, భీమ్ రాజ్, కంది శ్రీరాములు, విఠల్, చందు, అరుణ్ రావు, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

కరపత్రాలు పంపిణీ



చింతల్: ఆర్‌ఎస్‌ఎస్‌ను స్థాపించి వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో విజయదశమి రోజు ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ క్రమంలో బుధవారం వల్లభాయ్‌పటేల్‌నగర్‌లో ఆర్‌ఎస్‌ఎస్ నాయకుల ఆధ్వర్యంలో స్థానికులకు కరపత్రాలు పంపిణీ చేశారు. 28న ఫాదర్ మోడల్ హైస్కూల్‌లో జరిగే కార్యక్రమానికి రిటైర్డ్ ఆర్మీ ఆఫీసర్ చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని తెలిపారు.

ఉరేసుకుని ఐటీ ఉద్యోగి మృతి

నిజాంపేట్: బాచుపల్లి రాజీవ్‌గాంధీ నగర్ పూజిత ఎన్‌క్లేవ్‌లోని గ్రీన్ వ్యూ టవర్స్ ఫ్లాట్ నంబర్ 206లో మంగళవారం తోట శ్రావణ్ (32) అనే ఐటీ ఉద్యోగి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అతని తాత గొడ్డంటి ప్రసన్న ఆంజనేయులు బయటకు వెళ్లి పండ్లు పూలు కొనుక్కుని తిరిగి వచ్చేసరికి ఫ్లాట్ తలుపు లోపల నుంచి లాక్ చేసి ఉంది. పలుమార్లు తలుపు తట్టినా స్పందన లేకపోవడంతో బలవంతంగా తలుపు విరగ్గొట్టి లోపలికి వెళ్లగా, మనవడు బెడ్‌షీట్‌తో ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించాడు. తక్షణమే అపార్ట్‌మెంట్ వాసులకు సమాచారం ఇవ్వగా వారు 108 అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. 108 సిబ్బంది వచ్చి కిందకు దింపి పరిశీలించగా అప్పటికే మృతిచెందినట్లు ధృవీకరించారు. అనంతరం నిజాంపేట్ అర్బన్ హాస్పిటల్‌కు తరలించగా, అక్కడి వైద్యులు కూడా మృతి చెందాడని నిర్ధారించారు. మృతుడు శ్రావణ్ గత ఆరు నెలలుగా భార్యతో గొడవలు జరిగి విడిగా ఉంటున్నాడు. ఈ మేరకు బాచుపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అనుమతులకు మించి నిర్మాణాలు!

అక్రమ కట్టడాలపై ఫిర్యాదు చేస్తేనే నోటీసులతో సరి



సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్‌లో అక్రమ నిర్మాణాలకు అంతే లేకుండా పోయింది. వీటిని కట్టడి చేయాల్సిన సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో నిబంధనలకు విరుద్ధంగా ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపడుతున్నారు. ముఖ్యంగా మహాదేవపురం, రావినారాయణరెడ్డి నగర్, కైలాస్ హిల్స్, బాలాజీ లేఅవుట్‌లలో జీ ప్లస్ టు అనుమతి తీసుకొని నిబంధనలకు విరుద్ధంగా జి ప్లస్ ఫైవ్ అంతస్తులను నిర్మిస్తున్నారు. ఇదంతా సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారుల కనుసన్నల్లోనే జరుగుతుందనేది బహిరంగ రహస్యం. దీంతో ప్రభుత్వానికి రావాల్సిన కోట్లాది రూపాయల ఆదాయానికి గండి పడి నల్లధనం అక్రమార్గంలో అధికారుల జేబుల్లోకి వెళ్తుంది.

కూకట్‌పల్లికి చేరువలో..

కాంక్రీట్ జంగల్‌గా మారిన కూకట్‌పల్లిలో గజం విలువ రూ.1.50 లక్షల పైన పలుకుతుంది. దీంతో బిల్డర్ల కన్ను కూకట్‌పల్లికి అతి చెరువులో ఉన్న మహాదేవపురంపై పడింది. కూకట్‌పల్లిలో స్థలం కొనే ఖర్చుతో ఇక్కడ స్థలం, నిర్మాణం కూడా చేపట్టవచ్చు. దీంతో గడిచినా ఐదు సంవత్సరాల వ్యవధిలో మహాదేవపురం పరిసర ప్రాంతాల ఆనవాళ్లే మారిపోయాయి.

నోటీసులతోనే సరి

జీ ప్లస్ టు అనుమతితో అనుమతులకు మించి ఇక్కడ నిర్మాణరంగం జోరు అందుకుంది. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్న యజమానులకు సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారులు కేవలం నోటీసులతో సరిపెడుతున్నారు. ఒకవేళ సంబంధిత నిర్మాణంపై ఫిర్యాదులు పై అధికారుల వరకు వెళితే తూతూ మంత్రంగా కూల్చివేతలు చేపట్టి చేతులు దులుపుకుంటున్నారు

కోర్టును పక్కదోవ పట్టించి..

మహాదేవపురంలోని స్థానికంగా 329/4 నుంచి 329 బై 10 సర్వే నంబర్ వరకు 100 ఎకరాలు వివాదంలో ఉంది. గతంలో సదరు స్థలంలో నిర్మాణాలు చేపడితే స్వయంగా అప్పటి జాయింట్ కలెక్టర్ అక్కడికి వచ్చి సదరు స్థలం ప్రభుత్వ స్థలంగా పేర్కొంటూ నిర్మాణాలను కూల్చివేశారు. దీంతో స్థానికంగా కొంతమంది కోర్టును పక్కదోవ పట్టించి నిర్మాణాలు చేపడుతున్నారు. 300 గజాల స్థల విస్తీర్ణంలో నిర్మాణాన్ని కేవలం మూడు నెలల్లోనే పూర్తి చేస్తున్నారు.

చర్యలు తప్పవు



నిర్మాణాలు చేపట్టేటప్పుడు నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి. నిబంధనలను అతిక్రమించి నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవు. గతంలో ఇలాంటి నిర్మాణాలు చేపట్టిన వారికి నోటీసులు ఇచ్చి కూల్చివేతలు కూడా చేపట్టాం. ఒకవేళ అక్రమ నిర్మాణాల దారులతో సిబ్బంది చేతులు కలిపితే కఠిన చర్యలు తీసుకుంటాం.

– మల్లారెడ్డి, ఉప కమిషనర్, గాజులరామారం సర్కిల్

ప్రభుత్వ ఆదాయానికి గండి

ఇంటి నిర్మాణం చేపట్టే వారు నియమ నిబంధనలతో ప్రభుత్వానికి చలాన్ ద్వారా రుసుము చెల్లించి అనుమతి తీసుకోవాలి. కానీ సంబంధిత అధికారులు యజమానుల వద్ద ఎంతో కొంత ప్రభుత్వాన్ని కట్టించి మిగిలిన పెద్ద మొత్తాన్ని తన జేబులోకి వేసుకుంటున్నట్లు తెలుస్తుంది. దీంతో ప్రభుత్వానికి రావాల్సిన కోట్లాది రూపాయల ఆదాయం పక్కదోవ పడుతుందనడానికి ఇదే నిదర్శనంగా చెప్పుకోవచ్చు.

సీఎంఆర్‌ఎఫ్‌తో కార్పొరేట్ వైద్యం



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు కార్పొరేట్ వైద్య సేవలు అందుతున్నాయని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందిన ఈగ కిష్టయ్య, ఈగ రమ, మాదాస్ విజయ, పరుశ బాలమల్లేశ్ యాదవ్, రూపావతి సానుపల్లి, కృష్ణవేణి, సింగిరెడ్డి రమాదేవిలకు బుధవారం షాపూర్‌నగర్‌లోని తన నివాసంలో రూ.3.50 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో ప్రజారంజక పాలన కొనసాగుతోందన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ బుచ్చిరెడ్డి, ఈగ ఆంజనేయులు, అంజి యాదవ్, బాలకృష్ణారెడ్డి, ఆరీఫ్, మక్బుల్ బాయ్, సురేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కారుణ్య వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న నాగరాజు

నిజాంపేట్: తెలంగాణ ఆడబిడ్డలకు బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి, కారుణ్య వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకులు డాక్టర్ దాసి నాగరాజు చీరలు పంపిణీ చేశారు. బుధవారం అడ్డా వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం మహిళలకు ఉచితంగా చీరలు, ఆహార పదార్థాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ.. కారుణ్య వెల్ఫేర్ సొసైటీ నిస్వార్థమైన ప్రజాసేవకు కట్టుబడి ఉందన్నారు. భవన నిర్మాణ కార్మికులు అందరూ కలిసి మెలిసి ఉండి సమస్యలను పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. తదనంతరం నాగరాజును అడ్డా వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు సత్కరించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు ఝాన్సీరాణి, ప్రతినిధులు కమలాకర్, కిరణ్, రాజు, సందీప్, రామకృష్ణ, అడ్డా వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు హసన్, జగన్, బాలు, రంగనాథ్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా

ఎమ్మెల్యే వివేకానంద్



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తూ అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. బుధవారం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని దేవమ్మ బస్తీ, సంజయ్‌పురి కాలనీలలో రూ.50 లక్షల నిధులతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను చేసిన అభివృద్ధే తనను మూడుసార్లు ఎమ్మెల్యే చేసిందని, రానున్న రోజుల్లో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలో తీసుకువెళ్లేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జగన్, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, వేంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, సీనియర్ నాయకులు మల్లేష్ గౌడ్, బ్రహ్మానంద చారి, శశిధర్, సాజిద్, బండ మహేందర్, నాగరాజు తదితరులు ఉన్నారు.

సమస్యలపై పాదయాత్ర

చింతల్ గణేష్ నగర్‌లో అధికారులతో కలిసి ఎమ్మెల్యే పర్యటించారు. నూతనంగా ఎన్నికైన సంక్షేమ సంఘం సభ్యులు కాలనీలో నెలకొన్న రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ పైప్ లైన్ సామర్థ్యం పెంపు, చౌరస్తాలలో హైమాస్ట్ వీధి దీపాల ఏర్పాటు, శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభాల మార్పు, నాలాలలో పేరుకుపోయిన చెత్త తొలగింపు వంటి పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ దశలవారీగా సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

టీజీఎస్‌పీడీసీఎల్ స్థలం చుట్టూ ప్రహరీ నిర్మాణం



రంగారెడ్డినగర్: టీజీఎస్‌పీడీసీఎల్ స్థల పరిరక్షణకు ఎట్టకేలకు అధికారులు చర్యలు చేపట్టారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహాన్ని ఆనుకుని విద్యుత్ శాఖకు సంబంధించి కోట్లాది రూపాయలు విలువ చేసే స్థలం ఉంది. సుమారు వెయ్యి గజాలకు పైగా ఉన్న ఈ స్థలంలో కొందరు ఇసుక, ఇటుక, కంకర వ్యాపారాలు నిర్వహిస్తూ పాగా వేశారు. ఈ విషయమై విద్యుత్ శాఖ అధికారులు పలుమార్లు నోటీసులు జారీ చేసినా ఫలితం లేకపోయింది. దీంతో సదరు స్థలంలో టీజీఎస్‌పీడీసీఎల్ బోర్డులను ఏర్పాటు చేయడంతో పాటు చుట్టు ప్రహరీ గోడ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.

సమస్యలను పరిష్కరిస్తా

ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు



ఎమ్మెల్సీని కలిసిన సంక్షేమ సంఘం ప్రతినిధులు

దుండిగల్: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తానని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. బుధవారం శంభీపూర్‌లోని కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని పలు కాలనీలు, బస్తీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు స్థానికంగా నెలకొన్న సమస్యలపై ఎమ్మెల్సీని కలిసి విన్నవించారు. వాటిపై స్పందించిన ఆయన ..సంబంధిత అధికారులతో మాట్లాడి రోడ్లు, డ్రైనేజీ, ఇతర సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానన్నారు.

ఇంటింటికీ మొక్కల పంపిణీ

దుండిగల్: మొక్కలు నాటడం ద్వారా పర్యావరణాన్ని కాపాడవచ్చని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్ అన్నారు. బుధవారం మున్సిపల్ పరిధిలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా వన మహోత్సవాన్ని నిర్వహించారు. మహిళా గ్రూపు సభ్యులు ఇంటింటికి తిరుగుతూ మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ సాత్విక్, మహిళా గ్రూప్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు



మొక్కలు అందజేస్తున్న కమిషనర్ వెంకటేశ్వర్

జీఎస్టీ తగ్గింపుతో పేదలకు మేలు

ఎంపీ ఈటల రాజేందర్



కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ ఈటల రాజేందర్

కుత్బుల్లాపూర్: జీఎస్టీ శ్లాబ్‌లను తగ్గించి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పేద, మధ్య తరగతి ప్రజలకు మేలు చేసిందని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. బుధవారం కొంపల్లిలో మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు పెద్దబుద్దుల సతీష్‌సాగర్ ఆధ్వర్యంలో జీఎస్టీ రిడక్షన్ గ్రాటిట్యూట్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీ హాజరై మాట్లాడారు. ఒకప్పుడు లగ్జరీగా భావించే ఏసీలు, కార్లు నేడు మధ్య తరగతి ప్రజలకు అందుబాటులోకి వచ్చాయన్నారు. కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ శ్లాబ్‌లపై దుకాణదారులకు, ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత బీజేపీ కార్యకర్తలపై ఉందన్నారు.

విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి

రంగారెడ్డినగర్: ప్రైవేట్ విద్యా సంస్థల ఆగడాలను అరికట్టడంతో విద్యాశాఖ అధికారులు విఫలమయ్యారని ఏబీవీపీ కూకట్‌పల్లి భాగ్ కన్వీనర్ నగేష్ ఆరోపించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం దసరా సెలవులను ప్రకటించినా కొన్ని కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు నిబంధలకు విరుద్ధంగా నడుస్తున్నాయన్నారు. ర్యాంక్‌ల కోసం విద్యార్థులను ఒత్తిడికి గురి చేస్తున్నారని, స్థానిక డీఈవో, ఎంఈవోల అండదండలతోనే స్కూళ్ల యాజమాన్యాలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు.

సామాజిక సేవలో భాగస్వాములవ్వాలి



సర్టిఫికెట్లు అందజేస్తున్న మర్రి లక్ష్మణ్‌రెడ్డి

దుండిగల్: విద్యార్థులు చదువుతో పాటు సామాజిక సేవలో భాగస్వాములవ్వాలని మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి అన్నారు. జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) 56వ వార్షికోత్సవ వేడుకలను బుధవారం కళాశాల (ఎంఎల్ఆర్ఐటీ)లో ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కే శ్రీనివాస్ రావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నాయిని ఉదయ్ రంజన్‌గౌడ్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సేవ అనేది ఏదీ ఆశించకుండా చేసినప్పుడే దానికి నిజమైన అర్థం ఉంటుందన్నారు. జాతీయ సేవా పథకం అవార్డులను కత్తి హరిణి, ప్రశాంత్‌కు అందజేశారు. అదే విధంగా రెండు సంవత్సరాలు పూర్తిచేసిన వాలంటీర్లకు యూనివర్సిటీ లెవెల్ సర్టిఫికెట్లను అందజేశారు. ఎన్ఎస్ఎస్ డే సందర్భంగా నిర్వహించిన పెయింటింగ్ ఎలక్యూషన్ డిబేట్ స్కిట్ తదితర పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

వరద వెళ్లే మార్గం లేక..



బాలానగర్-నర్సాపూర్ రాష్ట్ర రహదారి చింతల్ ప్రధాన రోడ్డులో నిలుస్తున్న వరదనీరు



హెచ్ఎంటీ ట్రాక్టర్ పరిశ్రమ సమీపంలో..

చింతల్: హెచ్ఎంటీ ట్రాక్టర్ పరిశ్రమ నుంచి వచ్చే వరద నీరు బాలానగర్ నర్సాపూర్ రాష్ట్ర రహదారి గుండా సుమారు కిలోమీటర్ మేర రోడ్డుపై పారుతుంది. దీంతో ఉదయం సాయంత్రం వేళల్లో వాహనాల రద్దీ ఎక్కువగా ఉండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హెచ్ఎంటీ ట్రాక్టర్ పరిశ్రమ అధికారులు గానీ, జీహెచ్ఎంసీ, మాన్సూన్ హైడ్రా సిబ్బంది గానీ కల్పించుకొని హెచ్ఎంటి పరిశ్రమ నుంచి వచ్చే వరద నీటిని దారి మళ్లించాలని వాహనదారులు కోరుతున్నారు.

జగజ్జనని.. శుభప్రదాయిని



షిర్డీహిల్స్‌లోని శ్రీనాగసాయి మందిరంలో శాకాంబరిగా దర్శనమిచ్చిన అమ్మవారు

దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవార్లను అన్నపూర్ణాదేవి, శాకాంబరిగా అలంకరించారు. నియోజకవర్గ వ్యాప్తంగా దుర్గామాత మండపాలు, అమ్మవార్ల ఆలయాల్లో ఉదయం నుండి అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

– జగద్గిరిగుట్ట



అన్నపూర్ణాదేవిగా గాజులరామారం చిత్తారమ్మదేవి



శ్రీరామ్‌నగర్-బి లో దుర్గామాత పూజలో కేకేఎం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కూన శ్రీనివాస్‌గౌడ్



సోమయ్యనగర్‌లో అన్నపూర్ణాదేవిగా అమ్మవారు